www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | గురు వారం 9 జూన్ 2022 | ఎడిటర్: గోసుకొండ వృద్ధిరాజు | సంపుటి - 07, సంచిక-86 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## గవర్నర్ తమిళిసై కీలక నిర్ణయం

### రాజ్‌భవన్‌లో 10న ప్రజా దర్బర్ నిర్వహణ



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజ్‌భవన్‌లో ప్రజా దర్బర్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రజా దర్బార్‌లో భాగంగా మహిళా దర్బార్‌తో శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 10న శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు మహిళా దర్బార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. గవర్నర్ తమిళిసై జూన్ 10న మహిళా దర్బార్ నిర్వహించనున్నారు. తాను ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా దీన్ని శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు రాజ్ భవన్ లో నిర్వహించనున్నారు. గవర్నర్‌ను వచ్చి కలవాలనుకునే మహిళలు 040 - 23310521కు కాల్ చేయడం ద్వారా లేదా ఈమెయిల్ చేయడం ద్వారా అపాయింట్‌మెంట్ పొందొచ్చు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే రాజ్ భవన్ ఉందని, నెలకోసారి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని గవర్నర్ తమిళిసై ఇప్పటికే ప్రకటించారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

## ప్రజల్లో విష బీజాలు నాటుతున్నారు

### అలాంటి పార్టీలకు ప్రజలు బుద్ది చెప్పాలి: స్పీకర్



**నిజామాబాద్, జూన్ 8 (సమ సమాజం):** కుల , మతాలకతీతంగా కలిసిమెలిసి ఉంటున్న ప్రజలను విడదీసేందుకు ప్రయత్నిస్తున్న పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని శాసనసభా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం అఫందిఫారం గ్రామంలో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను, రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సేవాలాల్ మందిరం ప్రహరీని ఆయన ప్రారంభించడంతో పాటు గ్రామంలో ఎనిమిది డబల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన స్పీకర్‌కు స్థానిక తండా మహిళలు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసి ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేస్తున్నప్పటికి కొన్ని రాజకీయ పార్టీల నాయకులు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. ఆ పార్టీల పాలిత రాష్ట్రాల్లో ఇంత అభివృద్ధి, ఇలాంటి సంక్షేమ పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు అబద్దాలు చెప్పి తమ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చులు పెడుతున్న పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రాజీవ్‌తో కెటిఆర్ భేటీ



**న్యూఢిల్లీ, జూన్ 8 (సమ సమాజం):** కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. భారత ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలో ఉన్న అభివృద్ధి అవకాశాలపై కేంద్ర మంత్రితో కేటీఆర్ చర్చించారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన ఎకోసిస్టమ్‌ను సృష్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ వెంట ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, సురేశ్ రెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

## అమ్నేషియా పబ్ కేసులో ఆ కార్లు ఎవరివి

- వారికి ఎందుకు నోటీసులు ఇవ్వలేదు
- వారిని పిలిచి ఎందుకు విచారించడం లేదు
- వివరాలు కమిషనర్ సివి ఆనంద్ ఎందుకు దాస్తున్నారు
- మీడియాతో రేవంత్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 8 (సమ సమాజం):** జూబ్లీహిల్స్ అమ్నేషియా పబ్ కేసు తెలంగాణలో పొలిటికల్ హీట్‌ను పెంచింది. దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసుపై వివిధ పార్టీల నేతలు కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహీల్స్ మైనర్ బాలిక అత్యాచారం కేసులో పూర్తిగా నిజాలు చెప్తూనే కొన్ని ఆధారాలను హైదరాబాద్ సీపీ అనంద్ కప్పిపుచ్చుతున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. బాలిక రేప్‌నకు వినియోగించిన ఇన్నోవా కారు ప్రభుత్వ వాహనమని



2వ

## పోలీసులపై ఎలాంటి ఒత్తిడి లేదు

నిందితుల అరెస్ట్ చేసి విచారిస్తున్నారు ■ అనవసరంగా రాజకీయాలు చేయరాదు ■ జూబ్లీహిల్స్ కేసుపై మంత్రి మహ్మూద్ అలీ



హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): సంచలనం రేపిన జూబ్లీల్స్ మైనర్ బాలక రేప్ ఘటనకు సంబంధించి తెలంగాణ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ స్పందించారు. నిందితులు ఎవరైనా సరే తెలంగాణ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని మరోసారి రుజువైందన్నారు.పోలీసులు ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పోలీసులపై ప్రభుత్వం నుండి ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేయడంలో ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని చెప్పారు. తెలంగాణ

2వ

## మంత్రి తలసానికి చేపలు బహుకరణ

### తెలంగాణలో మత్స్య సంపద పెరిగిందన్నమంత్రి



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో మత్స్య సంపద భారీగా పెరిగిందని, మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మృగశిర కార్తె సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్‌కు చెందిన మత్స్యకారులు మంత్రి తలసానికి కొర్రమీను చేపలను అందజేశారు.

2వ

## బ్లాక్ మార్కెట్‌కు కేంద్రం ఇచ్చిన బియ్యం

- వాటి లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- అవసరమైనప్పుడు కెటిఆర్ సలహాలు తీసుకుంటాం
- కవితకు హిందుత్వం గుర్తుకు వచ్చినందుకు సంతోషం
- అత్యాచార ఘటనలపై సర్కార్ ఎందుకు స్పందించదు
- మండిపడ్డ బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** కేటీఆర్ తో చెప్పించుకునే స్థితిలో బీజేపీ లేదని ఎంపీ అర్వింద్ అన్నారు. తమకు అవసరమైనప్పుడు కేటీఆర్ సలహాలు తీసుకుంటామని సెటైర్ వేశారు. ఎవరినీ సస్పెండ్ చేయాలో...ఎవరికి బాధ్యతలు ఇవ్వాలో బీజేపీ నాయకత్వానికి తెలుసన్నారు. కవితకు ఇప్పటికైనా హిందుత్వం గుర్తొచ్చినందుకు సంతోషమన్న ఎంపీ, ఆమెకు

2వ

## ఆలయ ప్రతిష్ట వేడుకల్లో కవిత దంపతులు

### స్వామికి శాస్త్రోక్తంగా పూజల నిర్వహణ

**నిజామాబాద్, జూన్ 8 (సమ సమాజం):** నందిపేట్ మండలం చౌడమ్మ కొండూర్‌లో రాజ్యలక్ష్మి సమేత నృసింహస్వామి ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంల్లో ఎమ్మెల్సీ కవిత, అనిల్ దంపతులు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. వారు శాస్త్రోక్రంగా పూజలు నిర్వహించారు. ఐదో రోజైన బుధవారం.. ప్రాతః ఆరాధనతో ప్రారంభమైన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సేవాకాలం నివేదన, మంగళాశాసనాలు, శాత్తుమొరై, వేద విన్నపాలు, ద్వారా తోరణ



2వ

## కోవిడ్ టెస్టులు పెంచండి



### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** కరోనా ఫోర్త్ వేవ్ ముంచుకొస్తున్నదన్న హెచ్చరికల నేపథ్యం హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ తరుణంలో కొవిడ్ టెస్టులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం కోవిడ్ 19పై హైకోర్టులో విచారణ జరిగింది. కోవిడ్ జాగ్రత్తలు పాటించేలా చూడాలని ధర్మాసనం సూచించింది. కోవిడ్‌పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. కోవిడ్ బారిన పడి చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియాపై నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై సీజే జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కరోనా కేసులు పెరుగుతున్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం తెలిపింది. తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో కేసులు పెరుగుతున్నందున తగిన చర్యలు తీసుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి ధర్మాసనం స్పష్టం చేసింది.కరోనా మృతుల కుటుంబాలకు 15 రోజుల్లో ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో కరోనా పరిస్థితులు, చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 22కి వాయిదా వేసింది.

## రుణాల మంజూరులో దళారుల ప్రమేయం ఉండరాదు

- ■ కస్టమర్లను గౌరవప్రదంగా చూసుకోవాలి
- ■ లీడ్ బ్యాంక్ సమీక్షలో మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్, జూన్ 8 (సమ సమాజం):** ప్రతి ఒకక్కరిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బ్యాంకర్లు వినియోగదారులతో గౌరవంగా, మర్యాద పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తీర్చాలని, అప్పుడే వారు కూడా బ్యాంకులకు సహకరిస్తారని ఆయన తెలిపారు. రుణాల మంజూరులో దళారుల ప్రమేయం ఉండకూడదని, ఒకవేళ ఎవరైనా దళారీల ప్రమేయం ఉన్నట్లు అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని సుదర్శన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆజాది కా అమృత మహోత్సవం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కస్టమర్ అవుట్ రీచ్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అందరి సంతోషం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం బ్యాంకుల ద్వారా 5,500 కోట్ల రూపాయల రుణాలు మంజూరు అయినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించేందుకు నిరంతరం గ్రామాలలో నిధులుండేలా ముఖ్యమంత్రి వివిధ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.గడిచిన ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలోని బ్యాంకు ఉన్న ప్రతి గ్రామంలో సుమారు 25 కోట్ల రూపాయల టర్నోవర్ జరిగిందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని బ్యాంకర్లు గ్రామాలలోని నిరుపేదలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసి లోని నీరు పేదలకు సహకరిం చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే రుణాల గురించి ప్రజలకు విస్తృతంగా తెలియజేయా లన్నారు. కార్యక్రమలో రాష్ట్ర గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు బాలరాజు యాదవ్, మున్సిపల్ చైర్మన్ కె .సి. నరసింహులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి నాగరాజారావు ,మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాజేష్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, సుభాష్ పాల్గొన్నారు.

## బిజెపి ఆలోచనలన్నీ అమ్మకాలపైనే



- ■ అధికారంలోకి వస్తే ఆర్టీసిని కూడా అమ్మేస్తారు
- ■ నిధులు గుజరాత్‌కు...నిందలు తెలంగాణకు
- ■ మండిపడ్డ మంత్రి హరీష్ రావు

**మెదక్, జూన్ 8 (సమ సమాజం):** బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆర్టీసీని సైతం అమ్మకానికి పెడుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలను మోసం చేయడమే తెలుసునని ఆరోపించారు. బీజేపీకి గుజరాత్ తప్ప మరో ఆలోచన లేదన్నారు. కేంద్రం తీరు తెలంగాణకు మాటలు.. గుజరాత్‌కు మూటలు ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ బస్ డిపోను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎండాకాలంలోనూ కరెంటు

2వ

## పేదవాళ్లకో న్యాయం..పెద్దలకో న్యాయమా?

- ➢మైనర్ రేప్ కేసులో దోషులను రక్షిస్తున్న ప్రభుత్వం
- ➢తక్షణం చర్యలకు కాంగ్రెస్ మహిళా బృందం డిమాండ్
- ➢డిజిపికి వినతిపత్రం ఇచ్చిన కొండా సురేఖ తదితరులు



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** జూబ్లీహిల్స్ రేప్ కేసులో నిందితుల వెనక, అధికార పార్టీ నేతలు, రాజకీయ నాయకులు ఉన్నారని.. నిందితులను పోలీసులు కాపాడుతున్నారని కాంగ్రెస్ మహిళా నేతలు ఆరోపించారు. రాష్ట్రంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలపై డీజీపీకి మహిళా కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ బృందంలో ముఖ్యంగా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు డిసౌజ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావ్, కొండా సురేఖ, తదితరులు ఉన్నారు.దర్యాప్తు కూడా సరిగ్గా జరగడం లేదన్న మహిళా బృందం.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని.. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు.

2వ

## మేడ్చల్‌లో 125 కిలోల గంజాయి స్వాధీనం

### నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్



**మేడ్చల్ మల్కాజ్‌గిరి, జూన్ 8 (సమ సమాజం):** ఉప్పల్ పరిధిలోని మల్లాపూర్ చౌరస్తాలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని మహారాష్ట్రకు తరలించేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా సభ్యులకు చెందిన కారులో

2వ

## కూల్‌డ్రిక్‌లో చనిపోయిన బల్లి

- ➢అహ్మదాబాద్‌లో ఘటన..సోషల్ మీడియాలో వైరల్
- ➢లక్ష జరిమానా విధించిన అధికారులు

అహ్మదాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): కూల డ్రింక్‌లో బల్లి కనిపించిన ఘటన గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో వెలుగుచూసింది. అహ్మదాబాద్ అవుట్‌లెట్‌లోని కూల్ డ్రింక్‌లో చనిపోయిన బల్లి కనిపించడం కలకలం రేపింది. కూల్‌డ్రింకు గ్లాస్‌లో చనిపోయిన బల్లిని చూపించే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్ లో తనిఖీలు జరిపి,రూ. 1లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. మూడు నెలల పాటు

2వ

## సంపాదకీయం

# సెజ్‌లలో భద్రతా ప్రమాణాలు ఏవీ?

ప్రత్యేక ఆర్థిక మండళ్లకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వాలు అక్కడ పరిశ్రమల నుంచి రక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. విషపూరిత గ్యాస్‌లు లీకై ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా, ఆస్పత్రుల పాలవుతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అక్కడి పరిశ్రమల్లో రక్షణ చర్యలు, గ్యాస్ లీకైతే తీసు కోవాల్సిన చర్యలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు అటువైపు చూస్తున్నట్లుగా లేదు. విశాఖలో గతంలో ఎల్జీ పాలమర్స్ సంస్థలో గ్యాస్ లీక్ ద్వారా ఎందరో ప్రాణాలు కోల్పోయారు. తాజాగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి బ్రాండిక్స్ కంపెనీ పరిధిలో ఉన్న... సీడ్స్ అపెరల్ కంపెనీ ఈ నెల3న విష వాయువు వల్ల వందలాది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదం ఏ విషవాయువు వల్ల జరిగింది, ప్రమాదానికి కారణాలు ఏమిటన్న విషయాలు రోజులు గడుస్తున్నా నేటికీ తెలియపర్చలేదు. దీన్నిబట్టే కంపెనీ యాజమాన్యాలపై ప్రభుత్వ యంత్రాంగం అజమాయిషీ కోల్పోయిం దన్న అనుమానాలు, ఆరోపణలు ఉన్నాయి. సెజ్‌లో వివిధ పరిశ్రమలలో 50 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. అందులో బ్రాండిక్స్ కంపెనీలో 18 వేల మంది మహిళల కార్మికులు ఉపాధి పొందుతు న్నారు. రసాయనిక మంటలు ఆర్పే సాంకేతిక పరికరాలు సైతం ఇక్కడ కనిపించడం లేదనడానికి ప్రమాదం జరిగిన రోజు తీసుకున్న చర్యలే నిదర్శనం. సెజ్‌ల లోని భద్రతా ప్రమాణాల్లో డొల్లతనం అనేక సందర్భాల్లో కనిపి స్తున్నాయి. ప్రమాదాలు అనునిత్యం జరుగుతున్నా బాహ్య ప్రపంచానికి తెలియనివ్వకుండా యాజమా న్యాలు నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పరవాడ రాంకీ ఫార్మా సిటీ, హెటిరో, దివీస్, అచ్యుతాపురం సెజ్‌లలో సుమారు 150 కంపెనీలు వున్నాయి. వాటిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా ఏదో ఒక కంపెనీలో పేలుడు సంభవిస్తోంది. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగ డానికి గల లోపాలను అధికారులు వెల్లడించడంలేదు. బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా బ్రాండిక్స్ ఘటనలోనూ ఇదే వైఖరి. చాలా కంపెనీల్లో ఆరోగ్య కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదం జరిగితే అంబులెన్సులు అందుబాటులో లేని కంపెనీలు వున్నాయంటే కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యాలకు ఎంత చిత్తశుద్ధి వుందో అర్థమౌతుంది. న్ని కంపెనీల్లో మూడు నెలలకు ఒకసారి భద్రతా ఆడిట్ జరిపించాలి. మండే స్వభావం కలిగిన రసాయనిక ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రతా పరికరాలు ఇచ్చి ఆ ప్రాంతంపై అవగాహన కల్పించాలి. సంవత్సరానికి రెండు సార్లు థర్డ్ పార్టీ భద్రత ఆడిటింగ్ జరిపించాలి. భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. సెజ్‌లలో సూపర్ స్పెషాలిటి హాస్పటల్ నిర్మాణం చేపట్టాలి. రసాయనాలతో కూడిన పరిశోధన ప్రయోగశాలలు వుండాలి. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రోగికి పరీక్షలు నిర్వహించి సరైన నిర్ధారణ చేసి, వైద్యం అందించాలి. ఇటువంటి చర్యలు చేపట్టి ప్రజల పట్ల ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలి. అచ్యుతాపురంలో 10 వేల ఎకరాల భూమిలో ప్రత్యేక ఆర్థిక మండళ్లు(ఎస్ఇజెడ్‌లు) ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రత్యేక పరిస్థితులు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమల శాఖ జోక్యాన్ని ప్రభుత్వం నామమాత్రంగా మార్చడం తో, యాజమాన్యాలదే ఇష్టారాజ్యం అయిపోయింది. సెజ్‌లలో ఎక్కువగా రసాయన పరిశ్రమలు వున్నాయి. ఏ పరిశ్రమలో ఏ సమయంలో ఏ విషవాయువు లీక్ అవుతుందో తెలియని పరిస్థితిని మనం గమనించ వచ్చు. ఏదైన ప్రమాదం జరిగితే ప్రమాదానికి సంబంధించిన నివేదికలు రహస్యంగా వుంచడం తప్ప దానిని అరికట్టే చర్యలు లేకపోవడంతో యాజమాన్యాలు మరింత బరితెగిస్తున్నాయి. బ్రాండిక్స్‌లో జరిగిన ప్రమాదంలో కూడా అమ్మోనియం వాయువు పీల్చితే వచ్చే లక్షణాలు కనిపించడంలేదని సైన్స్ ఫర్ ది పీపుల్ ప్రకటించింది. నిజంగా అమ్మోనియం విడుదలైవుంటే బయోమేకర్ మెటబాలిస్ ద్వారా గుర్తించ వచ్చని పేర్కొన్నారు. అటువంటి ఆధారాలతో గుర్తించారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఈ ప్రమాదంలో 312 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఇప్పటి వరకు 194 మంది కార్మికులు డిశ్చార్జ్ అయ్యారు. 118 మంది చికిత్స పొందు తున్నారు. అయితే అచ్యుతాపురం బ్రాండిక్స్ సెజ్‌లోని సీడ్స్ అపెరల్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. అయితే మరోమారు గ్యాస్ లీకైనట్లు వార్తలు రావడంతో సీడ్స్ కంపెనీలో గ్యాస్ లీక్ కాలేదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారు. గ్యాస్ లీక్ ప్రమాదంపై ఆరుగురితో కూడిన జాయింట్ కమిటీ విచారణ ప్రారంభించనుంది. మరోవైపు సీడ్స్ కంపెనీలో గ్యాస్ లీక్ ప్రమాదంపై అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎసి నుంచి విడుదలైన రెసిడ్యూ గ్యాస్ నమూనాను ఎనాలిసిస్ కోసం హైదరాబాద్ పంపించారు. ఈ రిపోర్టు రావాల్సివుంది. ప్రమాదం జరిగిన రోజున అమోనియం గ్యాస్ లీకయినట్లు చెప్పి, మరుసటిరోజు అమోనియం గ్యాస్ కాదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏ గ్యాస్ కారణంగా వందల మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్న కోణం నుంచి విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. ఇకపోతే అస్వస్థతకు గురైన వారికి, వారి కుంటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన భోజన సదుపాయాలు, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ఘటన చూసి చలించిన కొంత మంది దాతలు మానవత్వాన్ని చాటుకొని భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.ఆస్పత్రులలో ఉన్న కార్మికులకు, వారి కుటుంబ సభ్యుల కు కనీస సౌకర్యాలను కూడా బ్రాండిక్స్ యాజమాన్యం కల్పించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎల్జీ పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వం ఆగమేఘాల మీద జోక్యం చేసుకుంది. బ్రాండిక్స్‌లో జరిగిన ప్రమాద విషయంలో పట్టించుకోక పోవడానికి ప్రజలకు ప్రభుత్వం మీద అనేక అనుమానాలు కలిగిస్తున్నాయి. మొదటి నుండి బ్రాండిక్స్ యాజమాన్యానికి ప్రభుత్వం కొమ్ము కాస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. పని ప్రదేశాల్లో రసాయనిక రియాక్టర్లలో ఆక్సిజన్ స్థాయి ఎంత వుందో చూడకుండానే రియాక్టర్ల లోకి కార్మికులను దింపడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా వున్నాయి. రసాయనిక కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటించడంలేదు. కార్మికులకు మాస్కులు, షూలు, గ్లౌజులు, ఆక్సిజన్ సూట్, ఫైర్ కోట్లు వంటి కనీస భద్రతా సామగ్రి కూడా అందించడంలేదు. పరిశ్రమల్లో రసాయనిక మార్పులు వచ్చిన ప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న శిక్షణ ఇవ్వడంలో కూడా తీవ్ర వైఫల్యం వుంది. దీనితో కార్మికులకు పని ప్రదేశాల్లో తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆంగ్ల బోధనకు సన్నద్ధం

### పాఠ్యపుస్తకాల సరఫరాలో ఆలస్యం ● ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

**నిజామాబాద్, జూన్ 8 (సమ సమాజం):** ఈనెల 13వ తేదిన పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పుస్తకాలు పూర్తి స్థాయిలో అప్పటివరకు వచ్చే అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. పాత వాటితోనే బోధన చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. జిల్లాలో పలు పాఠశాలల్లో కొత్త పుస్తకాలు వచ్చే వరకు తెలుగులోనే బోధన చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఇంగ్లీష్ మీడియం బోధన జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు అవసరమైన పుస్తకాల సరఫరా లో జాప్యం నెలకొనే అవకాశాలు కనిపించడంతో ఇంగ్లీష్ మీడియం బోధనపై నీలినీడలు కమ్ముకునే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. కేవలం కొద్ది రోజుల్లో పాఠశాలలను తిరిగి ప్రారంభించనుండడంతో పాఠ్యపుస్తకాలు అవసరమైన సంఖ్యలో విద్యార్థులకు అందుతాయో లేదోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది. విద్యాశాఖ వర్గాలు మాత్రం సమయానికి పుస్తకాలు అందిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. విద్యా ప్రమాణాల పెంపునకు పలు చర్యలు చేపడుతున్న అధికారులు ఇందుకు అవసరమైన పాఠ్యపుస్తకాల పంపిణీపై శ్రద్ధ చూపడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు వచ్చేలా లేని పరిస్థితి చోటుచేసుకుంటోంది. ప్రతీ సంవత్సరం మూడు నెలలు ముందుగానే పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటుంటాయి. ప్రస్తుత రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి రాలేదు. దీంతో సమయానికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుతాయా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఏటా ప్రభుత్వం ముందస్తుగా పాఠ్యాంశాల ముద్రణ ప్రారంభిస్తుంది. కానీ ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి పరిస్థితి తారుమారుగా తయారైంది. పాఠశాలలు ప్రారంభమయ్యే తొలి రోజు విద్యార్థులకు పుస్తకాలు అందించడంపై పలు అనుమానాలు నెలకొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా యూడైస్ ఆధారంగా ఒక్కో విద్యార్థికి తరగతిని బట్టి 5 నుంచి 11 పుస్తకాలు అవసరమవుతాయి. ఎన్ని పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయన్న అంచనాతో జిల్లా విద్యాశాఖాధి కారులు ప్రభుత్వా నికి ఇండేంట్ పంపారు. రాష్ట్ర స్థాయిలో పుస్తకాల ముద్రణ పూర్తి కాకపోవడంతో జిల్లాకు ఇంకా పుస్తకాలు చేరుకోలేదని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. గత యేడాది పుస్తకాలు ముందుగానే వచ్చినప్పటికీ కొన్ని తరగతులు, సబ్జెక్టులకు సంబంధించి సరఫరా కాలేదు. ప్రధానంగా ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు రాలేదు. హిందీ పాఠ్య పుస్తకాల కొరత నెలకొంది. దీంతో చదువుకునేందుకు ఉన్నత తరగతుల విద్యా ర్థులు ఇబ్బందుల పాలయ్యారు. ప్రస్తుత విద్యాసంవత్సరమైనా పూర్తి స్థాయిలో అందేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. సకాలంలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తేనే బోధన సక్రమంగా జరిగే అవకాశాలుంటాయి. పాఠ్యపుస్తకాల సరఫరాలో ఆలస్యం చోటుచేసుకుంటే అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు తిప్పలు తప్పవు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బడి బాట పేరిట కార్యక్రమాలను నిర్వ హిస్తోంది. దీనికి తోడు మన ఊరు, మన బడి పేరిట కార్యక్రమాలు చేపడుతోంది. ఇంగ్లీష్ మీడియం కూడా ప్రారంభం కానుండడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన నెలకొంది.

## అమ్నేషియా పబ్ కేసులో ఆ కార్లు ఎవరివి

(మొదటి పేజి తరువాయి) లోకమంతా కోడై కూస్తున్నా ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. మైనర్లు కారును నడిపినప్పుడు తక్షణమే యాజమానులకి ఎందుకు నోటిసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ లైంగిక దాడి కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలన్నారు. ఆరోపణలు ఎదర్కొంటున్న వారిని విచారించాలని, కమిషనర్ సీవీ ఆనంద్ కొన్ని విషయాలు బయటకు చెప్పకుండా దాచిపెట్టారని అన్నారు. బెంజ్ కారు యజమాని ఎవరో చెప్పలేదు. ఇన్నోవా కారు ఎవరిదో కూడా సీవీ ఆనంద్ చెప్పలేదు. ప్రభుత్వ వాహనం అని స్టిక్కర్లు తొలగించింది ఎవరని ప్రశ్నించారు. ఇప్పటి వరకు వాహనాల యజమానులకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదు. నిందితులు ఆధారాలు లేకుండా చేసిన ప్రయత్నాలను ఎందుకు చెప్పలేదు. పాత్రధారులు, సూత్రదారులు ఎవరన్నది సీవీ ఆనంద్ చెప్పడం లేదని విమర్శించారు..ఆ కార్ల ఓనర్లను మోటార్ యాక్ట్ చట్టం 133 ప్రకారం.. పోలీస్ స్టేషన్‌కి పిలిపించి విచారించాలని అన్నారు. ఆ కారు ఓనర్ల పేర్లను ఎందుకు దాస్తున్నారో సీవీ ఆనంద్ చెప్పాలని అన్నారు. సెక్షన్ 13 ఫోక్సో చట్టం ప్రకారం ఆ కార్ల ఓనర్లపై కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అత్యాచారం జరిగిన రెండు రోజుల వరకు ఇన్నోవా కారు ఎక్కడ పోయిందని రేవంత్ ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించాల్సిన కారుని అసాంఘిక కార్యక్రమాలకు ఎలా వినియోగిస్తున్నారని రేవంత్ ప్రశ్నించారు. కారులో ఉన్న అన్ని ఆధారాలను తొలగించిన తర్వాతే .. పోలీసులకు దొరికిందని రేవంత్ ఆరోపించారు. ఈ కేసులో అత్యంత కీలకమైన నాయకుల పిల్లలపైన ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. విశ్వనగరంగా కావలసిన హైదరాబాద్‌ని కేసీఆర్, కేటీఆర్ విషపు నగరంగా మార్చారని రేవంత్ విమర్శించారు. గత వారం రోజుల్లో మైనర్ అమ్మాయిలపై అత్యాచారాలు జరిగాయని, దీనికి కారణం పబ్బులు, డ్రగ్స్,గంజాయి అని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక హైదరాబాద్ లో 150 పబ్బులకి అనుమతి ఇచ్చారని, లిక్కర్ యజమానులు మొత్తం కల్వకుంట్ల కేసీఆర్ చుట్టాలేనని రేవంత్ అన్నారు. అంతార్జతీయ విమనాశ్రయం పేరు చెప్పుకొని రాష్ట్ర ప్రభుత్వం బ్రోకర్ హౌస్ నడుపుతుందని రేవంత్ విమర్శలు గుప్పించారు. మైనర్‌ను లైంగిక దాడి చేసిన వాహనాల ఓనర్లను పిలిచి ఎందుకు విచారించలేదు. ఇన్నోవా కారులో బాలికను తీసుకెళ్లారు. ఆమెపై లైంగిక దాడి జరిగిందని చెబుతున్నారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిదే బాధ్యత కాదా అని అన్నారు. కార్ల యజమానులపై ఎందుకు కేసు పెట్టలేదని, వాహన యజమానులను ఎందుకు దాస్తున్నారని రేవంత్ సూటిగా ప్రశ్నించారు.

## కూల్‌డ్రింక్‌లో చనిపోయిన బల్లి

అవుట్‌లెట్‌లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు చెప్పారు.ఆర్డర్ చేసిన శీతల పానీయం గ్లాసులో చనిపోయిన బల్లిని చూపించే వీడియో సోషల్ మీడియాలో కనిపించడంతో మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్ కు మున్సిపల్ అధికారులు సీలు వేశారు. భార్గవ్ జోషి అనే కస్టమర్ తన స్నేహితులతో కలిసి మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్‌లో శీతల పానీయాల గ్లాసులు, రెండు బర్గర్‌లను ఆర్డర్ చేశాడు.ఫిర్యాదు చేసి 4 గంటలకు పైగా గడిచినా, ఔట్‌లెట్‌లో ఎటువంటి చర్యలు తీసుకోలేదని భార్గవ్ జోషి వీడియోలో చెప్పారు. శీతల పానీయంలో చనిపోయిన బల్లి కనిపించిందని ఫిర్యాదు చేయడంతో అవుట్‌లెట్ సూపర్‌వైజర్ దీనికి బదులుగా రూ. 300 చెల్లించడానికి ముందుకొచ్చారు.ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ దేవాంగ్ పటేల్ కూడా శీతల పానీయాల నమూనాలను అహ్మదాబాద్‌లోని పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి పరీక్ష కోసం పంపారు. కార్పొరేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఔట్‌లెట్ తెరవరాదని మున్సిపల్ అధికారులు ఆదేశించారు.

## హైదరాబాద్‌కు మాటలు..గుజరాత్‌కు మూటలా

### వరదలు వస్తే కనీసం ఆదుకోని కేంద్ర ప్రభుత్వం ● మోడీ ట్వీట్‌పై ఘాటుగా స్పందించిన కెటిఆర్



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** తెలంగాణలోని వంశపారంపర్య దుష్టపాలనకు ముగింపు పలకాలని ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ గురించి ఆలోచిస్తున్నట్లు చెప్పుకునే మీరు.. వరదలు వచ్చినప్పుడు నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు మాటలు, నిధులు మాత్రం గుజరాత్‌కు అంటూ ప్రధాని నరేంద్ర మోదీని తెలంగాణ పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ గురించి ఆలోచిస్తున్నట్లు చెప్పుకునే ప్రధాని వరదలు వచ్చినప్పుడు నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మూసి నది ప్రక్షాళనకు, మెట్రో రైలు పొడిగింపునకు, రాష్ట్రానికి ఐటీఐఆర్ ప్రాజెక్టు విషయాలపై పురోగతి ఏంటో చెప్పాలని ట్విటర్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రధాని చేసిన ట్వీట్‌కు ఈ మేరకు కేటీఆర్ బదులు ఇచ్చారు. అంతకుముందు హైదరాబాద్ కార్పొరేటర్లతో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. భేటి అనంతరం తెరాస ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ప్రధాని, తెలంగాణలోని వంశపారంపర్య దుష్టపాలనకు ముగింపు పలకాలని ట్వీట్ చేశారు. దీనిపై ఘాటుగా స్పందించిన కేటీఆర్ సమాజ సేవకు ప్రయత్నాలేమైనా ఉన్నాయా అంటూ ప్రధానిపై వ్యంగ్యస్త్రాలు సంధించారు. మీరు నడుపుతుంది ప్రభుత్వాన్నా లేదా స్వచ్ఛంద సంస్థనా ప్రశ్నించారు.

## పేదవాళ్లకో న్యాయం..పెద్దలకో న్యాయమా?

(మొదటి పేజి తరువాయి) మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై పోలీసులు కఠినంగా వ్యవరించాలన్న వారు.. హైదరాబాద్ లో చాలా పబ్స్ అక్రమంగా నడుస్తున్నాయని, ప్రశ్నించిన వారిపైనే అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక పై గ్యాంగ్ రేప్ జరిగితే రాష్ట్ర మహిళా మంత్రులు ఎక్కడికి పోయారు ? జాగృతి మహిళా అధ్యక్షురాలు కవిత.. బాలిక రేప్ కేసుపై ఎందుకు మౌనంగా ఉంటున్నారు ? బాలిక రేప్ పై మహిళా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంత్రులు డమ్మీ అయ్యారని, పేదవాళ్ల నేరాలకు పాల్పడితే ఎన్ కౌంటర్ చేస్తారు... ధనవంతుల పిల్లలు నేరాలు చేస్తే వదిలేస్తున్నారని విమర్శించారు.

## పోలీసులపై ఎలాంటి ఒత్తిడి లేదు

(మొదటి పేజి తరువాయి) పోలీసులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేస్తారనేదానికి కేసులో ఆరుగురిని అరెస్ట్ చేయడం అందుకు నిదర్శనమని అన్నారు. తమను బ్లేమ్ చేసేందుకు కొన్ని రాజకీయంగా శక్తులు కుట్రలు పన్నుతున్నాయన్నారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ ఇతర స్టేట్ పోలీసులకు ఆదర్శంగా ఉన్నారని గుర్తు చేశారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించండి పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వహించాలి.టెక్నాలజీ స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పిల్లల్లో పరివర్తనలో మార్పు వచ్చిందన్నారు. పేరెంట్స్ తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మైనర్ బాలిక అత్యాచారం వ్యవహారంలో తన మనవడిపై అనవసర ఆరోపణలు చేశారని, అసలు నిందితులు అరెస్ట్ కావడంతో తన మనవడిపై ఆరోపణలు తప్పని తేలిందని మహమూద్ అలీ అన్నారు. జూబ్లీ హిల్స్ మైనర్ బాలిక అత్యాచార ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రిమహమూద్ అలీ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి భర్తీ బోర్డు ద్వారా జరిగినందున చైర్మన్ తొలగింపు కూడా బోర్డు పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఎంఐఎం ఎమ్మెల్యే కొడుకు పై కేసు వేరు... రాజకీయా సంబంధాలు వేరు అని గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. సెల్ ఫోన్ల వల్ల కొన్ని అనర్థాలు జరుగుతున్నాయని, తల్లిదండ్రుల పిల్లల విషయంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఘటనకు సంబంధించి చట్టపరిధిలో పోలీసులు తమ పని తాము చేసుకుంటారని మంత్రి పేర్కొన్నారు.

## బ్లాక్ మార్కెట్‌కు కేంద్రం ఇచ్చిన బియ్యం

(మొదటి పేజి తరువాయి) హిందుత్వం గుర్తు చేసిందే బిజేపీ అని చెప్పారు. తెలంగాణలో అత్యాచారాలపై ప్రభుత్వ పెద్దలు ఏం సమాధానం చెప్తారని అర్వింద్ ప్రశ్నించారు. కేంద్రం ఇస్తోన్న ఉచిత రేషన్ బియ్యాన్ని ముఖ్యమంత్రి కొడుకు బ్లాక్ మార్కెట్ చేసుకుంటున్నాడని ఆరోపించారు. గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఏంచేశారో సీఎం కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గ్రూప్ వన్ పరీక్షలో ఉర్దూ భాషను ఎత్తివేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మి జీతాలు, పెన్షన్లు ఇవ్వటం సిగ్గుచేటన్నారు. నాలుగైదు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం అవుతున్నప్పటికీ.. టెక్స్ట్ బుక్స్ కోసం టెండర్లకు పిలవకపోవటం దారుణమని మండిపడ్డారు. ఆహారం, ఆరోగ్యం, ఆవాసం తెలంగాణలో అటకెక్కాయని అర్వింద్ విమర్శించారు. వివిధ అంవాల్లో పూర్తిగా విఫలం అయ్యారని టీఆర్ఎస్ ప్రభుత్వంపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తమకు అవసరమైనప్పుడు మంత్రి కేటీఆర్ సలహాలు తీసుకుంటామని సెటైర్లు వేశారు. ఎమ్మెల్సీ కవిత కు హిందుత్వం గుర్తొచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. బైంసాలో హిందువులపై దాడులను ఆపాలని ఆయన కవితకు విజ్ఞప్తి చేశారు. గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఏమి చేశారో సీఎం, కేటీఆర్, సోమేష్ కుమార్ సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మి జీతాలు, పెన్షన్లు ఇవ్వటం సిగ్గుచేటన్నారు.

## మంత్రి తలసానికి చేపలు బహుకరణ



(మొదటి పేజి తరువాయి) ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని నీటి వనరులలో ఉచితంగా చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో మత్స్యకారుల ఆదాయ భారీగా పెరిగిందని, ఎంతో ఆనందంగా ఉన్నారని చెప్పారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజున మంత్రికి కొర్రమీను చేపలను అందిస్తున్నట్లు మత్స్యకారులు తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో శాడా కోటేశ్వరరావు, గడప దేవేందర్, గరిగే నరసింగరావు, గరిగే సంపత్ తదితరులు ఉన్నారు

## బిజెపి ఆలోచనలన్నీ అమ్మకాలపైనే



(మొదటి పేజి తరువాయి) కష్టాలు లేవని, 70 ఏళ్లలో గత ప్రభుత్వాలు ఒక్క చెక్ డ్యామ్ నిర్మించలేదని ఆరోపించారు. ఎనిమిదేళ్లలో 15 చెక్‌డ్యామ్‌లు కట్టామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారున్న కర్నాటకలో పరిస్థితి ఏంటని ఈ సందర్భంగా మంత్రి ప్రశ్నించారు. కర్ణాటకలో రూ.1400కు క్వింటాల్ వడ్లు కొంటే.. తెలంగాణలో రూ.1920కి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కర్నాటక రైతులు రాష్ట్రానికి ధాన్యం తెచ్చి అమ్ముకుంటున్నారన్నారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలు కర్నాటకలో లేవన్నారు. వడ్లు కొనుగోలు చేయకుండా కేంద్రం మోసం చేసిందని ఆరోపించారు. రైతులు ఇబ్బంది పడొద్దని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. పార్లమెంట్‌లో ఇచ్చిన వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ హామీ ఏమైందని, తెలంగాణకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గుజరాత్ వెళ్లిందన్నారు. ఆర్థిక సంఘం నివేదికను కేంద్రం తొక్కిపెట్టిందని, తెలంగాణకు రూ.9వేలకోట్ల ఎగనామం పెట్టిందని, నీతి ఆయోగ్ సూచనలు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ గుండెచప్పుడు కేసీఆర్ అన్నారు. నర్సాపూర్‌లో త్వరలో టూరిస్ట్ హబ్, పీజీ కాలేజీకి పక్కా భవనం నిర్మిస్తామన్నారు. రూ.35కోట్లు మంజూరు చేశామని, మల్లన్నసాగర్ నీళ్లు నర్సాపూర్ వస్తాయని, కాలంతో పని లేకుండా నీళ్లు వచ్చేలా చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంపై మంత్రి హరీష్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రానికి ఎప్పుడూ ఏదో సంస్థను అమ్మాలనే ఆలోచనే ఉందని తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వానిది వ్యాపార ధోరణెళినని దుయ్యబట్టారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తే ఆర్టీసీ అమ్మేయడం ఖాయమన్నారు. డబుల్ డెక్కర్ గవర్నమెంట్ ఉన్న చోట్ల 6 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. సంస్థలను అమ్మడం కాదని, కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తీసుకెళ్లారని, రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.9 వేల కోట్లను కేంద్రం ఇవ్వలేదని హరీష్‌రావు విమర్శించారు.

## డ్రగ్ మాఫియాకు అడ్డాగా హైదరాబాద్

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా మైనర్ బాలికలపై అత్యాచారాలు పెరోగిపోతున్నాయని, హైదరాబాద్ డ్రగ్ మాఫియాకు అడ్డాగా మారిపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకే పబ్బులు, అందులో అన్ని ఆ సాంఘిక కార్యకలాపాలు జరుగుతు న్నాయని ఆరోపించారు. పబ్బుల మీద ప్రభుత్వానికి పట్టింపు ఏదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ మైనర్ బాలిక ఘటన దారుణమన్నారు. అలాగే నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. పబ్బు యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కేసు వెనుకాల పెద్ద వాళ్ళ హస్తం ఉంది..అందుకే కేసు ఆలస్యం చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో పబ్బులు మూసి వేయాలన్నారు. దానికి ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. జూబ్లీహిల్స్ ఘటనను సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. 10 వ తేదీ మగ్ధూమ్ భవన్‌లో వామపక్ష పార్టీల సమావేశం ఉంటుందన్నారు. అందులో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. పెరుగుతున్న చార్జీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాలపై కూడ చర్చ ఉంటుందన్నారు.

## ఆలయ ప్రతిష్ట వేడుకల్లో కవిత దంపతులు

(మొదటి పేజి తరువాయి) ధ్వజకుంభారాధన, చతుఃస్థానార్చన, అగ్ని ముఖం మూలమంత్రమూర్తి మంత్రహవనం, పంచసూక్తం పరివార ప్రాయశ్చిత్త హవనం, నిత్యపూర్ణాహుతి, నివేదన, మంగళాశాసనములు, వేద విన్నపాలు, శాత్తుమోరై, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకు.. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వార తోరణ ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, అగ్ని ముఖం, మూల మంత్రమూర్తి, మంత్ర హవనములు, ప్రతిష్ఠా విగ్రహాలకు ఫల పుష్ప శయ్యాధివాసము, తత్వ వ్యాస హవనము, పంచసూక్త పరివార ప్రాయశ్చిత్త హవనము, నిత్య పూర్ణాహుతి, నివేదన, మంగళాశాసనము, వేద విన్నపాలు, శాత్తుమోరై, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు.

## జూబ్లీహిల్స్ బాలిక రేప్ కేసు

### ఇన్నోవా కారు వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌దే

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** జూబ్లీహిల్స్ బాలిక రేప్ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. నిందితులు వాడిన ఇన్నోవా కారు వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌దిగా నిర్ధారించారు. దినాజ్ పేరిట ఇన్నోవా కారును వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కొన్నారు. ఏడాదిన్నరగా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఇన్నోవా నడుపుతున్నారు. మే 28న ఇన్నోవాలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కుమారుడు పబ్‌కు వెళ్లాడు. బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు.. ఒకవేళ విషయం బయటపడినా అంత తేలిగ్గా దొరక్కుండా ఉండేందుకు కుయుక్తులు పన్నారు. తమ సిమ్ కార్డులను ఇద్దరు ఇతర వ్యక్తుల ఫోన్లలో వేసి వాళ్లను గోవా పంపారు..

# గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్



## పల్లె ప్రగతి కార్యక్రమాలతో మార్పు: గుత్తా

**నల్లగొండ, జూన్ 8 (సమ సమాజం):** గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పథకాలతో కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మన ఊరు–మన బడి పథకం కింద 38 లక్షల రూపాయలతో గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధి పనులకు, గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు అభివృద్ధి పనుల కోసం తన నిధుల నుంచి 15 లక్షలు మంజూరు చేశానన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో గ్రామాల రూపురేఖలు మారబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండలి చైర్మన్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తూర్పు ఇరాన్‌లో ఘోర ప్రమాదం

### ఘటనలో 10 మంది మృత్యువాత

**న్యూఢిల్లీ, జూన్ 8 (సమ సమాజం):** తూర్పు ఇరాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం తెల్లవారుజామున ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 10 మంది చనిపోయారు. మరో 50 మందికిపైగా గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

డారి నగరమైన తబాస్ సమీపంలో తెల్లవారుజామున.. ఏడు బోగీలు ఉన్న రైలులోని నాలుగు బోగీలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. కమ్యూనికేషన్? సరిగ్గా లేని ఘటనాస్థలికి మూడు హెలికాప్టర్లలో రెస్క్యూ బృందాలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు చెప్పారు.రైలు పట్టాలకు సమీపంలో ఉన్న ఎస్కవేటర్?ను రైలు బలంగా ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. అయితే రాత్రి సమయంలో ఎస్కవేటర్ అక్కడ ఎందుకు ఉందో స్పష్టంగా తెలియరాలేదని అన్నారు. ఏదైనా మరమ్మత్తు ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడ ఉందేమోనని అనుమానిస్తున్నారు. రాన్‌లో ఏడాదికి సగటున 17,000 మంది ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. ట్రాఫిక్ రూల్స్ విస్మరించి వాహనాలు నడపడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# మేడ్చల్‌లో 125 కిలోల గంజాయి స్వాధీనం



(మొదటి పేజి తరువాయి) నుంచి 125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి, గంజాయి రవాణాను అడ్డుకున్నారు.అయితే ఓ వ్యక్తి అరకు నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. మల్లాపూర్ చౌరస్తాలో మరో ముగ్గురు వ్యక్తులు గంజాయి కోసం వేచి చూస్తున్నారు. ఇదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. కారులో ఓ వ్యక్తి గంజాయి తీసుకొస్తున్నాడని వారు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడే ఉండి, గంజాయిని తరలిస్తున్న కారును గుర్తించి సీజ్ చేశారు. ఈ గంజాయిని పుణె తరలించేందుకు ముగ్గురు వ్యక్తులు సిద్ధమైనట్లు పోలీసులు తెలిపారు.కారులో ఉన్న 125 కిలోల గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లు, రూ. 92 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఒడిశాకు చెందిన శంకర్ బెహారా అరకులో 125 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దీన్ని మిగతా ముగ్గురికి రూ. 5 వేల చొప్పున కిలో గంజాయిని విక్రయించేందుకు బేరం కుదుర్చుకున్నాడు. పుణెలో రూ. 12 వేల చొప్పున కిలో గంజాయిని అమ్మేందుకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు.

# తెలంగాణపై కేంద్రం అక్కసు

### చిన్న కారణాలతో కొర్రీలు పెడుతున్న ఎఫ్‌సిఐ

### కేంద్రం తీరుపై మండిపడ్డ గంగుల కమలాకర్



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** తెలంగాణ పచ్చగా ఉండడం చూసి ఓర్వలేక కేంద్రం ఇబ్బందులు పెడుతోందని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. చిన్న చిన్న కారణాలతో ధాన్యం కొనుగోలు చేయబోమంటూ ఎఫ్.సి.ఐ. లేఖ రాసిందని ఆయన పేర్కొన్నారు.ఎఫ్.సి.ఐ. ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆయన అన్నారు.2020 ఏప్రిల్ నుంచి ఐదు కిలోల ఉచిత బియ్యాన్ని కేంద్రంతో పాటు ఇచ్చాము.90,46,000 కార్డుల్లో 53,00,000 కార్డులకుమాత్రమే కేంద్రం ఉచిత బియ్యం ఇస్తోందని ఆయన అన్నారు. బుధవారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం పై 8 నెలల పాటు 980 కోట్ల భారం పడిందిని మంత్రి చెప్పారు. 2021 జూన్ నుంచి ఏప్రిల్ 2022 వరకు కూడా ఉచితంగా బియ్యం ఇచ్చామని చెప్పారు.11 నెలలు 1134 కోట్ల భారం పడింది. 2022 మార్చిలో లేఖ రాసి ఏప్రిల్ నుంచి ఆర్నెళ్ళు ఉచితబియ్యం ఇవ్వాలని కేంద్రం లేఖలో రాసింది అన్నారు. మూడో దశ కూడా ఉచితబియ్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని గుర్తు చేశారు. సేకరణ, ఇతర కారణాల వల్ల ఉచితబియ్యం ఒక నెల ఆలస్యం అయిందననారు.జూన్ నుంచి తెల్ల రేషన్ కార్డు దారులందరికీ సెప్టెంబర్ వరకు ఉచితబియ్యం ఇస్తున్నామని తెలిపారు.ఎఫ్.సి.ఐ.కి అన్ని వివరాలు అందిస్తాం.రెండో దశలో 63 మిల్లుల్లో తేడా అని జూన్ 4న లేఖ రాశారు. దాన్ని కలెక్టర్లకు పంపి పరిశీలించమని ఆదేశించాం.రాష్ట్ర ప్రభుత్వ పైసా వృధా కాకుండా చూస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్నచిన్న సాకులతో ధాన్యం కొనుగోళ్లు చేయబోమని ఎఫ్.సి.ఐ. ప్రతిసారి బెదిరించడం తగదన్నారు. ఫ్.సి.ఐ. బియ్యం తీసుకోవాల్సిందేనన్నారు.ఇన్నేళ్లు ఎప్పుడూ లేనిది ఎఫ్.సి.ఐ. మాపై ఎందుకు దాడి చేస్తోందన్నారు. ఫ్.సి.ఐ. ఇలాంటి వన్నీ మానుకొని ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఆయిల్ కంపెనీలు మా పరిధిలో లేవు.పెట్రోల్, డీజిల్ కు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పాం. సాయంత్రం వరకు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. స్టాకు ఉండి ప్రజలకు పెట్రోల్, డీజిల్ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడుతున్నామని, కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అత్యాచార కేసులో దోషులకు అండగా ప్రభుత్వం

### నిందితులను అరెస్ట్ చేయకుండా దాచిపెడుతున్నారు

### ప్రబుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సీతక్క



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** టీఆర్ఎస్ వచ్చాక రోడ్లపై మర్డర్లు, పరువు హత్యలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. హైదరాబాద్‌లో అత్యాచారానికి గురైన బాధితురాలికి న్యాయం చేయకుండా, దోషులను శిక్షించకుండా తప్పించాలని చూస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ మైనర్ బాలిక కేసులో అసలు నిందితులను అరెస్ట్ చేయకుండా దాచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీస విచారణ లేకుండా నాటకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో రాజకీయం ప్రయోజనం పొందటం టీఆర్ఎస్, బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నా.. ముఖ్యమంత్రి ఫాం హౌస్ నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. పబ్ లు, క్లబ్లు నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్నా పోలీస్ వ్యవస్థ నిద్రపోతుందన్నారు. పోలీసులను కేసీఆర్ సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలకు భద్రత కల్పించే విషయంలో కాకుండా విపక్షాలపై నిఘా నేత్రాలు మాత్రం బాగా పనిచేస్తున్నాయన్నారు.టీఆర్ఎస్ సర్కార్ వచ్చాక రోడ్లపైమర్డర్లు, పరువు హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. సోనియ గాంధీ అటవీ హక్కుల చట్టాన్ని తీసుకువచ్చి పట్టాలు ఇస్తే నేడు ఆ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలోకి తొక్కుతుందని మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్..వారికి ఒక్క ఎకరం కూడా ఇవ్వలేదన్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి కులాలు,మతాల పేరుతో,ప్రాంతాల పేరుతో రాజకీయం ప్రయోజనం పొందటం టీఆర్ఎస్,బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు.

# టీఆర్ఎస్ పాలనతో గ్రామాల్లో అభివృద్ధి



### పల్లెప్రగతితో మారిన రూపురేఖలు

### కేంద్రం సహకారం లేకున్నా పురోగమిస్తున్న రాష్ట్రం

### మంత్రి సబితతో కలసి పల్లెప్రగతిలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి

**రంగారెడ్డి, జూన్ 8 (సమ సమాజం):** టీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. కేంద్రం పైసా విదిల్చకున్నా కెసిఆర్ అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయలేదన్నారు. కేంద్ర సహకారం ఉండివుంటే తెలంగాణ మరింతగా పురోగమించేదన్నారు. 5వ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా..బుధవారం జిల్లాలోని మహేశ్వరం మండలం గొల్లూరులో పల్లె ప్రగతి కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేశారు. గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన మంత్రులు.. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంశాల వారీగా గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తుందా? ట్రాక్టర్ గ్రామంలో ఎన్ని గంటల నుంచి తిరుగుతున్నది? డంపింగ్ యార్డు పని చేస్తున్నదా? తడి పొడి చెత్త వేరు చేసి ఎరువులు తయారు చేస్తున్నారా? ఎంత మేర ఆదాయం సమకూరుతుంది? వైకుంఠ ధామం పనిలోకి వచ్చిందా? వినియోగిస్తున్నారా? సంక్షేమ పథకాలు వస్తున్నాయా? వంటి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామం నుంచి బడి పిల్లల కోసం బస్‌ను వేయిస్తామమని చెప్పారు. గొల్లూరులో మహిళలకు స్త్రీ నిధి కింద రూ.3 లక్షల వరకు నిధులు అందజేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గ్రామానికి సంక్షేమ పథకాలు అన్నీ కలిపి కోటి రూపాయలను ప్రభుత్వం ఇస్తున్నది. గతంలో ఇలా ఎప్పుడైనా వచ్చిందా? గత ప్రభుత్వాలు ఏమి చేశాయి? ఈ ప్రభుత్వం ఏమి చేసింది? అనే విషయాన్ని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. 70 ఏళ్ల నుంచి కానిది ఎనిమిదేండ్లలో సాధించి చూపారని ఆయన ప్రశంసించారు. కాంగ్రెస్, బీజేపీ దేశాన్ని సర్వ నాశనం చేశారు. కేసీఆర్ ఇప్పుడు రాష్ట్రాన్ని బాగు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఎంపీ కార్యక్రమంలో డాక్టర్ జి రంజిత రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితుల సమగ్రాభివృద్ధి కోసమే దళితబంధు



### కెసిఆర్ సాహసోపేత నిర్ణయంతో దళితులకు మేలు

### లబ్దిదారులకు వాహనాలు అందచేసిన మంత్రి తలసాని

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** దళితుల సమగ్రాభివృద్ధి కోసమే ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆర్థికంగా ఎంతో వెనుకబడిన దళితులు అభివృద్ధి సాధించాలనేది సీఎం కేసీఆర్ ఆలోచన అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కెసిఆర్ సాహసంతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలో దళితబంధు లబ్దిదారులకు వాహనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించే ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా అమలులో లేదని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి సూచించారు. గతంలో ఎవరైనా దళితుల అభివృద్ధి గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ.. హైదరాబాద్ కార్పొరేటర్లను ఢిల్లీకి పిలిచి ఒట్టి చేతులతో పంపారని, నగర అభివృద్ధి కోసం నిధులిస్తే ప్రజలకు మేలు జరిగేదని విమర్శించారు.




# చలన చిత్రం

## మహేశ్‌బాబు సరసన శ్రద్ధాకపూర్.

రాజమౌళి- మహేశ్ బాబు కాంబోలో తెరకెక్కనున్న సినిమా.. పూర్తి స్క్రిప్ట సిద్ధమవకముందే ఎన్నో



అంచనాలు పెంచేసింది. ఈ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లోనే కాదు చిత్ర పరిశ్రమలోనూ ఆసక్తి నెలకొంది. అడవి నేపథ్యంలో సాగే యాక్షన్ సినిమా అనే ఊహాగానాలు ఆ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇప్పుడు మరో ఆసక్తికర వార్త టాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.ఈ క్రేజీ ప్రాజెక్టులో మహేశ్‌బాబు సరసన బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ సందడి చేయనుందని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలోని కథానాయిక పాత్రకు ఆమెనే న్యాయం చేయగలదని భావించిందట చిత్ర బృందం. మహేశ్ బాబుతో కలిసి నటించేందుకు శ్రద్ధా సుముఖంగా ఉందని, వచ్చే ఏడాది ఈ సినిమా పట్టాలెక్కే అవకాశాలున్నాయని సమాచారం. అంతకుముందు ప్రభాస్? సాహోతో ఆమె దక్షిణాది ప్రేక్షకులను పరిచయమైంది. ఇక గతంలో మహేశ్ సరసన ఆలియాభట్ కూడా నటించనుందని ప్రచారం సాగింది. విజువల్ ఎఫెక్ట్స్‌కు అధిక ప్రాధాన్యత ఉండే ఈ పాన్ ఇండియా సినిమాకు రాజమౌళి తండ్రి, ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు.

## 'హను-మాన్'లో విలన్‌గా వినయ్ రాయ్ ... పోస్టర్ రిలీజ్

యంగ్ హీరో తేజ సజ్జ, హీరోయిన్ అమృత అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని ప్రైమ్ షో ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్లు ఆసక్తి కలిగించాయి. తాజాగా విడుదలైన మరో పోస్టర్ మరింత ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమాలో పవర్ ఫుల్ విలన్ మైఖెల్ పాత్రలో హీరో వినయ్ రాయ్ నటిస్తున్నాడు. తాజాగా ఆయన పోస్టర్ ను రానా దగ్గుబాటి ఆవిష్కరించాడు. పోస్టర్ చూస్తుంటే ఇందులో వినయ్ రాయ్ అత్యంత బాడాస్ ఈవిల్ మ్యాన్ గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. బ్లాక్ లాంగ్ సూట్ లో చుట్టూ డ్రోన్స్ తో ఉన్న వినయ్ రాయ్ పోస్టర్ థ్రిల్లింగ్ గా ఉంది. వినయ్? రాయ్? ఇంతకుముందు నీవల్లే నీవల్లే, వాన సినిమాలో హీరోగా అలరించాడు. కాగా ఈ మూవీలో ఓ కీరోల్ లో వరలక్ష్మీ శరత్ కుమార్ నటించనున్న విషయం తెలిసిందే.




## లోకేష్ కనగ్ రాజ్ దర్శకత్వంలో రామ్ చరణ్..?



ఆర్‌ఆర్‌ఆర్, ఆచార్య సినిమాల తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తన 15వ చిత్రాన్ని చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ తో కలిసి భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రాన్ని శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. అంజలి, జయరామ్, నవీన్ చంద్ర, సునీల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.అయితే, ఈ సినిమా తర్వాత చరణ్ నుంచి కూడా ఇంట్రెస్టింగ్ లైనప్ రెడీగా ఉంది. ఇప్పటికే, 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో చేయనున్న ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే, కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇదే వరుసలో ప్రశాంత్ నీల్‌తో పాటు మరికొందరు దర్శకులు కథలు సిద్ధం చేసుకొని చరణ్ కాల్ కోసం వెయిట్ చేస్తున్నారు.అయితే, ఈ లైనప్‌లో కోలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ లోకేష్ కనగ్ రాజ్ కూడా చేరాడని తెలిసిందే. ఇంతకముందే చరణ్ – లోకేష్ కలిసి ఓ పాన్ ఇండియా చిత్రాన్ని చేయబోతున్నారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు దీనికి సంబంధించిన కథ రెడీ అవుతుందట. ఆర్సీ 15 కంప్లీట్ అయ్యేలోపు చరణ్‌కు కథ చెప్పడానికి ప్లాన్ చేసుకుంటున్నాడట లోకేష్. ఇటీవల వచ్చిన 'విక్రమ్' సినిమాతో కమల్ హాసన్ కు భారీ హిట్ ఇచ్చాడు. నెక్ట్స సినిమాను 'తలపతి' విజయ్‌తో చేయబోతున్నాడు. .

## కృతిశెట్టికి మరో బంపర్ ఆఫర్.



సినీరంగంలో కొంత మంది నటీమణులకు గుర్తింపు రావడానికి చాలా సమయం పడుతుంది. అదే కొంత మందికి మొదటి సినిమాతోనే విపరీతమైన గుర్తింపు వస్తుంది. ఎంత మంచి పాత్రలు వచ్చిన, నటన ఎంత బాగా చేసిన కొంచెం అదృష్టం కూడా ఉండాలి అని సినీతారలు అంటుంటారు. అలా అదృష్టాన్ని అరచేతిలో పట్టుకుని ఇండస్ట్రీక్రి వచ్చింది కృతి శెట్టి. ఉప్పెన చిత్రంతో ఇండస్ట్రీరోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ వరుస సినిమాలతో ధక్షిణాదిలో దూసుకుపోతుంది. ప్రస్తుతం ఈమె చేతిలో అరడజను సినిమాలున్నాయి. ఈ క్రమంలో తాజాగా కృతికి మరో స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు సమాచారం.కోలీవుడ్ స్టార్ ధనుష్, అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రంలో హీరోయిన్‌గా కృతిని ఎంపిక చేసినట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన రానుంది. కాగా ఇప్పటికే తమిళంలో సూర్య, బాలా ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. కృతి ప్రస్తుతం తెలుగులో రామ్‌తో 'ది వారియర్', సుధీర్ బాబుకు జోడిగా 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి', నితిన్ సరసన 'మాచర్ల నియోజక వర్గం' సినిమాలలో నటిస్తుంది. ఈ మూడు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి.


## వైరల్‌గా నయనతార-విఘ్నేశ్ వెడ్డింగ్ ఇన్విటేషన్ వీడియో?



నయనతార-విఘ్నేశ్ శివన్ పెళ్లికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీరిద్దరు మూడు ముళ్ల బంధంతో ఒకట్టి కానున్నారు. ఈ వివాహ వేడుకకు మహాబలిపురం వేదిక కానుంది. అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుక జరగనుంది.అయితే తాజాగా నయన్-విఘ్నేశ్ వెడ్డింగ్ ఇన్విటేషన్ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఈ యానిమేటేడ్ వీడియోలో వధువు, వరుడు తమిళ సాంప్రదాయ దుస్తులు ధరించి కలిసి నడుస్తున్నట్లుగా చూపించారు. ఇందులో నయనతార, విఘ్నేష్? తల్లిదండ్రుల పేర్లు, పెళ్లి తేది, జరిగే సమయం, వేదికను పొందుపర్చారు. ఇదిలా ఉంటే పెళ్లి జరిగే మహాబలిపురంలోని రిసార్ట్?లో ఇప్పటికే భద్రత ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ?ఈ వేడుకకు వచ్చే అతిథులందరూ ప్రత్యేక డ్రెస్ కోడ్?లో హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

## మళ్ళీ హీరోగా వేణు

టాలీవుడ్ లో ఒకప్పుడు హీరోగా బాగా పేరు తెచ్చుకున్న వారు.. ఆ తర్వాత కాలంలో తెరమరుగయ్యారు. అలాంటి వారి లిస్ట్ చాలానే ఉంది. విజయాలు దక్కక కొందరు, ఆఫర్స్ అందుకోలేక మరికొందరు సినిమాలకు దూరమయ్యారు. ఈ జాబితాలో మొదటి వరుసలో ఉన్న హీరో తొట్టెంపూడి వేణు . టాలీవుడ్ లో ఒకప్పుడు మంచి హిట్స్ తో జోరుమీదుండేవాడు ఈ హీరో. 'స్వయంవరం , చిరునవ్వుతో , కళ్యాణరాముడు , పెళ్ళాం ఊరెళితే , చెప్పవే చిరుగాలి ' లాంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు వేణు. 'హనుమాన్ జంక్షన్' చిత్రంలో అయితే అద్భుతమైన కామెడీ పండించి సత్తా చాటుకున్నాడు. అయితే ఆ తర్వాత మరికొన్ని చిత్రాల్లో హీరోగా నటించినప్పటికీ.. కాలం కలిసిరాలేదు.వేణు హీరోగా ఆఖరిగా తెరపై కనిపించిన చిత్రం 'రామాచారి : వీడో పెద్ద గూఢచారి' . ఈ సినిమా తర్వాత వేణు లాంగ్ గ్యాప్ తీసుకున్నాడు. మధ్యలో యన్టీఆర్ దమ్ము చిత్రంతో కేరక్టర్ ఆర్టిస్ట్ గా మారాడు. ఆ సినిమా ఫ్లాప్‌తో వేణుకు ఆ తర్వాత అంతగా ఆఫర్స్ దక్కలేదు. ప్రస్తుతం రవితేజ 'రామారావు ఆన్ డ్యూటీ' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా వేణు హీరోగా ఒక ప్రాజెక్ట్గ ÷నైల్ చేసుకున్నట్టు టాక్స్ వినిపిస్తున్నాయి. ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స బ్యానర్ పై అనురాగ్ , శరత్ నిర్మించబోతున్న ఈ సినిమాకి సూర్య అనే కొత్త దర్శకుడు టాలీవుడ్ కు పరిచయం అవుతున్నాడట. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళబోతున్నట్టు సమాచారం. ఈ సినిమాను కొద్దిరోజుల్లో అధికారికంగా ప్రకటించబోతున్నారు. మరి లాంగ్ గ్యాప్ తో మళ్ళీ హీరోగా ప్రవేశిస్తున్న వేణు ఈ సినిమాలో తన కామెడీ టైమింగ్ తో ఎలా మెప్పిస్తాడో, ఈ సినిమా ఏ స్థాయిలో సక్సెస్ అందిస్తుందో చూడాలి.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in